సాక్షి
మెదక్
మంగళవారం ၊ 23 ၊ జూలై ၊ 2024



కొనేదెలా.. తినేదెలా!

కూరగాయల ధరల మండుతున్నాయి. ఏది ముట్టుకున్నా కిలో రూ.80 నుంచి 100 పలుకుతోంది.

వివరాలు 8లో ▸



అల్లం ధరపై ఆందోళన

కేరళ నుంచి వచ్చే లేత అల్లం మూలంగా ఉమ్మడి జిల్లా నుంచి తరలించే పంటకు డిమాండ్ పడిపోతోంది.

వివరాలు 8లో ▸



ఇష్టారాజ్యంగా విధులకు

ఇష్టారాజ్యంగా అధికారులు విధులకు హాజరవుతున్నారు. కలెక్టర్ హెచ్చరికలు సైతం పట్టించుకోవడం లేదు.

వివరాలు 9లో ▸

నేడు రామాయంపేట మున్సిపల్ కమిషనర్‌తో ఫోన్ ఇన్

రామాయంపేట మున్సిపల్ పరిధిలోని ఆయా వార్డుల్లో పారిశుద్ధ్యం, పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు, ప్రజల ఇబ్బందులు తదితర అంశాలపై మున్సిపల్ కమిషనర్ ఫోన్ ద్వారా సలహాలు, సూచనలు ఇస్తారు.





అంశం: పారిశుద్ధ్యం, పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు
మున్సిపాలిటీ: రామాయంపేట
కమిషనర్: మామిడి దేవేందర్
తేదీ: 23-7-2024 (మంగళవారం)
సమయం: ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు

ఫోన్ చేయాల్సిన నంబర్ :
79896 95428, 94400 03884

చెరువులకు చేప పిల్లలు!

నేడు కలెక్టరేట్‌లో టెండర్ల ఓపెన్

- ఈఏడాది లక్ష్యం 5.2 కోట్లు
- 16,820 మంది మత్స్యకారులకు మేలు



ఎట్టకేలకు ప్రభుత్వం ఉచిత చేపపిల్లల పంపిణీకి గ్రీన్ సిగ్నల్ ఇవ్వగా టెండర్ల ప్రక్రియ మొదలైంది. మంగళవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ సమక్షంలో టెండర్లను ఓపెన్ చేయనున్నారు. ఈనెల 10వ తేదీ నుంచి చేప పిల్లల సరఫరాకు మత్స్యశాఖ అధికారులు ఆన్‌లైన్ ద్వారా టెండర్లను ఆహ్వానించారు.

– మెదక్‌జోన్

జిల్లాలో 2 వేల పైచిలుకు చెరువులు చేపల పెంపకానికి అనువైనవి ఉండగా.. ఈ ఏడాది 1,660 చెరువుల్లో 5.2 కోట్ల చేపపిల్లలు పంపిణీ చేయనునట్లు అధికారులు చెబుతున్నారు. ఇందుకు గానూ రూ.4.5 కోట్ల వ్యయం కానునట్లు తెలిసింది. కాగా కొంతకాలంగా జిల్లాలో 35- 40 ఎంఎం సైజు గల చేప పిల్లలను మాత్రమే పంపిణీ చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

వర్షాలు సమృద్ధిగా కురిస్తేనే..

చెరువుల్లోకి 90 శాతం మేర నీరు వస్తేనే అందులో చేప పిల్లలను వదులుతారు. చెరువుల్లో వదిలాక 8 నెలల నుంచి సంవత్సరం వరకు నీరు నిల్వ ఉండాలి. అప్పుడే చేపలు 600 గ్రాముల నుంచి కిలో వరకు సైజు పెరుగుతాయి. లేనిచో అవి పెరగక పోగా చెరువులో నీటి నిల్వ తగ్గి చనిపోయే ప్రమాదం ఉంటుంది. కాగా ఈ ఏడాది సరైన వర్షాలు లేకపోవడంతో చెరువులు, కుంటల్లోకి చెప్పుకోదగ్గ నీరు రాలేదు. మూడు రోజులుగా కురుస్తున్న ముసురుతో కొంత మేర నీరు వచ్చి చేరుతుంది. గతేడాది జూలైలోనే చెరువులు నిండు కుండల్లా మారి పొంగిపొర్లాయి. దీంతో ఆగస్టు మొదటి వారం వరకు జిల్లాలో ఉచిత చేపపిల్లల పంపిణీ పూర్తయ్యేది. కానీ ఈ ఏడాది టెండర్లే ఈనెలాఖరుకు అవుతున్నాయి. దానికి తోడు వర్షాల ఆలస్యం మరో కారణం అంటున్నారు.

తిలాపియాతో తీవ్ర నష్టం

గతేడాది టెండర్లు చేజిక్కించుకున్న కాంట్రాక్టర్లు అతి తక్కువ ధరకు లభించే తిలాపియా పిల్లలను పంపిణీ చేశారు. దీంతో మత్స్యకారులు తీవ్రంగా నష్టపోయారు. చేపలను పట్టి ఎక్కడ పడితే అక్కడ పారబోశారు. ఈసారి అలాంటి పరిస్థితి రాకుండా నాణ్యమైన చేప పిల్లలను పంపిణీ చేసే విధంగా చర్యలు చేపట్టాలని మత్స్యకారులు కోరుతున్నారు.

జిల్లాలో 300 మత్స్య సహకార సంఘాలు

జిల్లాలో 300 మత్స్య సహకార సంఘాలు ఉండగా వాటిలో 16,820 మంది సభ్యులు ఉన్నారు. అందులో 22 మహిళా మత్స్య సహకార సంఘాలు ఉండగా 1,070 మంది మహిళా మత్స్యకారులు ఉన్నారు. పురుషులు చేపలు పట్టుకొస్తే మహిళలు వాటిని మార్కెట్‌కు తీసుకెళ్లి విక్రయించి ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు.

రైలు బండి.. కొత్త స్టాపులివ్వండి

కేంద్ర బడ్జెట్‌పై జిల్లా ప్రజల గంపెడాశలు

చిన్నశంకరంపేట(మెదక్): జిల్లాలోని ప్రధాన రైల్వేస్టేషన్లు అక్కన్నపేట, మిర్జాపల్లి, వడియారంలలో పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ ఇవ్వాలనే డిమాండ్ గత కొన్నేళ్లుగా ఉంది. ఇందులో ముఖ్యంగా అజంతా ఎక్స్‌ప్రెస్‌కు మిర్జాపల్లి రైల్వేస్టేషన్‌లో హాల్ట్ ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు. అలాగే వడియారంలో దేవగిరి, కృష్ణా ఎక్స్‌ప్రెస్‌లను నిలపాలనే డిమాండ్ ఉంది. ఇదే విషయంపై మెదక్ ఎంపీ రఘునందన్‌రావుపై భారం వేసిన ప్రజలు, కేంద్ర బడ్జెట్‌పై గంపెడాశతో ఉన్నారు.



చిన్నశంకరంపేట మండలం మిర్జాపల్లి రైల్వేస్టేషన్

- జిల్లాలో మనోహరాబాద్- అక్కన్నపేట వరకు దక్షిణ మధ్య రైల్వేలైన్ ఉండడంతో తెలంగాణ, ఏపీతో పాటు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, రాజస్తాన్‌కు నిత్యం అనేక రైళ్లు ప్రయాణిస్తుంటాయి.
- ఇందులో గతంలో మిర్జాపల్లి రైల్వేస్టేషన్‌లో జైపూర్, అజంతా, అజ్మీర్ ఎక్స్‌ప్రెస్‌తో పాటు అనేక రైళ్లకు హాల్టింగ్ ఉండేది.
- మారిన పరిస్థితుల్లో కొన్ని రైళ్లను దారి మళ్లించగా, మరికొన్నింటికి హాల్టింగ్ ఇవ్వడం లేదు.
- ఇందులో ముఖ్యమైన అజంతా ఎక్స్‌ప్రెస్‌ను నిలపాలనే డిమాండ్ ఉంది. అలాగే రాయలసీమ, విశాఖ ఎక్స్‌ప్రెస్ హాల్ట్ ఇవ్వాలని కోరుతున్నారు.
- నిజామాబాద్- తిరుపతి మధ్య నడిచే రాయలసీమ ఎక్స్‌ప్రెస్ జిల్లా మీదుగా వెళ్తున్నా ఎక్కడా ఆగడం లేదు.
- దీంతో తిరుపతి వెళ్లే భక్తులు పొరుగు జిల్లా కామారెడ్డికి వెళ్లి రైలు ఎక్కాల్సిన పరిస్థితి నెలకొంది.
- మిర్జాపల్లిలో నిలిపేందుకు రైల్వే జీఎం హామీ ఇచ్చినా నెరవేరలేదు. వడియారంలో సైతం నిలపాలనే డిమాండ్ ఉంది.
- అలాగే నిత్యం తిరుపతికి రాకపోకలు సాగించే కృష్ణా ఎక్స్‌ప్రెస్‌కు అక్కన్నపేట, మిర్జాపల్లిలో హాల్టింగ్ ఉంది. అయితే వడియారంలో నిలపాలనే డిమాండ్ ఉంది.
- అజంతా ఎక్స్‌ప్రెస్ వడియారంలో ఆగుతుండగా మిర్జాపల్లిలో నిలపాలని స్థానికులు కోరుతున్నారు.
- చిన్నశంకరంపేట-మిర్జాపల్లి మధ్య అనేక పరిశ్రమలు ఏర్పడడంతో ఇతర రాష్ట్రాలకు చెందిన కార్మికులు ఈ రైలులో ప్రయాణం చేస్తుంటారు.
- ఇదే విషయమై చిన్నశంకరంపేట, నార్సింగి మండలంలోని బీజేపీ నాయకులు ఎంపీ రఘునందన్‌రావును కలిసి వినతిపత్రం అందించారు.
- బడ్జెట్ సమావేశాల్లో కేంద్ర రైల్వే మంత్రిని కలిసి ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

న్యూస్‌రీల్

ఎస్జీటీలను రిలీవ్ చేయాలి: తపస్



సభ్యత్వ నమోదు రశీదు అందజేస్తున్న సురేష్

వెల్దుర్తి(తూప్రాన్): బదిలీ అయిన ఎస్జీటీలను వెంటనే రిలీవ్ చేయాలని తపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేష్ డిమాండ్ చేశారు. సోమవారం మాసాయిపేట మండలంలోని పలు ఉన్నత పాఠశాలల్లో తపస్ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న 4 డీఏలను వెంటనే ప్రకటించాలన్నారు. ప్రాథమిక పాఠశాలల్లో తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించి ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలని కోరారు. అర్హత కలిగిన ఎస్జీటీలకు పీఎస్ హెచ్‌ఎంలుగా ప్రమోషన్ కల్పించాలన్నారు. అలాగే వచ్చే ఎమ్మెల్సీ ఎన్నికల లోపు ఎస్జీటీలకు ఓటు హక్కు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్లం, లక్ష్మణ్, రాష్ట్ర కార్యదర్శి భాస్కర్, నాయకులు రంగారెడ్డి, హెచ్‌ఎంలు ధర్మపురి, బాలమని, శిరీష, వాణి, భద్రయ్య, బ్రహ్మానందం ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలి



కలెక్టరేట్‌లో నిరసన తెలుపుతున్న ముదిరాజ్ సంఘం నాయకులు

మెదక్ కలెక్టరేట్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ముదిరాజ్‌లను వెంటనే బీసీ–డీ నుంచి బీసీ–ఏలోకి చేర్చాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు పుట్టిరాజు డిమాండ్ చేశారు. సోమవారం ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముదిరాజ్‌లు ఏళ్లుగా సామాజిక, విద్య, ఆర్థిక, ఉద్యోగ రంగాల్లో వెనకబడిపోయారని వాపోయారు. కార్యక్రమంలో నాయకులు భిక్షపతి, రాములు, భాస్కర్, నర్సింలు, కిష్టయ్య, కిరణ్, గణేష్, ఉమామహేశ్వర్, శేఖర్, సురేందర్, సంతోష్, సందీప్, నాగరాజు, రమేష్, గోపాల్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల రక్షణకే షీటీంలు



మాట్లాడుతున్న సంతోషి

చిన్నశంకరంపేట(మెదక్): మహిళల రక్షణ కోసమే ప్రభుత్వం షీటీంలను ఏర్పాటు చేసిందని మిషన్ శక్తి జిల్లా అధికారిణి సంతోషి తెలిపారు. సోమవారం చిన్నశంకరంపేట జెడ్పీ పాఠశాలలో లీగల్ అథారిటీ, భరోసా, మిషన్ శక్తి టీం ఆధ్వర్యంలో వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. బాలికలు అత్యవసర సమయంలో 100కు డయల్ చేసి షీటీం ద్వారా రక్షణ పొందాలన్నారు. చదువుకునే వయసులో పెళ్లి చేస్తామని కుటుంబ సభ్యులు ఒత్తిడి తీసుకువస్తే అధికారులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో లీగల్ అడ్వైజర్లు సుజాత, సిద్ధాగౌడ్, భరోసా రిసోర్స్ పర్సన్ మంజుల, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శివలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో విఫలం

సీఐటీయూ నేత నర్సమ్మ ధ్వజం



కలెక్టరేట్ ఎదుట ఆశావర్కర్ల ధర్నా

మెదక్ కలెక్టరేట్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఆశావర్కర్లకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి నర్సమ్మ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టి నిరసన తెలిపారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆశావర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18,000 ఇవ్వాలన్నారు. అనేక ఏళ్లుగా పెండింగ్ లో ఉన్న రిజిస్టర్స్‌ను త్వరగా ప్రింట్ చేసి ఆశాలకు అందించాలన్నారు. ఆరు నెలల వేతనంతో కూడిన మెడికల్ సెలవులను ప్రకటించాలన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం సమ్మె కాలపు హామీలను వెంటనే అమలు చేయాలని.. లేనిపక్షంలో పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి బసవరాజు, జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశం, ఆశావర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సావిత్రి పాల్గొన్నారు.

ప్రతిభను వెలుగులోకి తీసుకురావాలి



నాగులపల్లి పాఠశాలలో టీఎల్‌ఎం మేళాను పరిశీలిస్తున్న జేడీ రాజీవ్

శిక్షా సప్తాహ్ జేడీ రాజీవ్

నర్సాపూర్ రూరల్/శివ్వంపేట: విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ ఎంతో ఉపయోగపడుతుందని శిక్షా సప్తాహ్ జేడీ రాజీవ్ అన్నారు. సోమవారం మండలంలోని నాగులపల్లి (బంజారానగర్) పాఠశాలలో నిర్వహించిన టీఎల్‌ఎం మేళాను సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఉపాధ్యాయుడు టీఎల్‌ఎంను అనుసరిస్తూ విద్యార్థులకు పాఠాలు బోధించాలని సూచించారు. అనంతరం ఏఎంఓ వెంకటస్వామి, ఎంఈఓ బుచ్చనాయక్‌తో కలిసి మేళాను పరిశీలించి ఉపాధ్యాయులను అభినందించారు. అలాగే శివ్వంపేట ఉన్నత పాఠశాలలో నిర్వహించిన శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. విద్యార్థులు కాగితం, వెదురుతో తయారు చేసిన పలు వస్తువులను పరిశీలించి అభినందించారు. విద్యార్థులు చదువులో రాణించి ఉన్నతస్థాయికి ఎదగాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే కొల్చారం మండల కేంద్రంలోని ప్రాథమిక, ఉన్నత (బాలురు, బాలికల) పాఠశాలల్లో టీచర్ లెర్నింగ్ మెటీరియల్‌ను డీఈఓ రాధాకిషన్ పరిశీలించారు. బోధనా సామగ్రి విద్యార్థులకు ఏ మేర ఉపయోగకరంగా ఉన్నాయనే విషయమై పాఠశాల విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు తరగతి గదిలోకి వెళ్లే ముందు బోధనా సామగ్రిని వెంట తీసుకెళ్లి, పాఠ్యాంశాన్ని బోధించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ నీలకంఠం, ఉపాధ్యాయులు ఉన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయం

అదనపు ఎస్పీ మహేందర్



ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు ఎస్పీ మహేందర్

మెదక్ మున్సిపాలిటీ: శాంతి భద్రతల పరిరక్షణే పోలీసుల ధ్యేయమని, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా ప్రజలు పోలీసుల సేవలను వినియోగించుకోవాలని అదనపు ఎస్పీ మహేందర్ సూచించారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి ఆదేశానుసారం ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. వాటిని పరిశీలించిన ఆయన ఫిర్యాదిదారులకు చట్టప్రకారం న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని సంబంధిత పోలీస్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో అనుమానాస్పద వ్యక్తులు కనబడినా, సంఘ వ్యతిరేక చర్యలు జరుగుతున్నాయని మీ దృష్టికి వచ్చిన పోలీస్ కంట్రోల్ రూంకు 8712657888కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

మెదక్ కలెక్టరేట్: మెదక్ ప్రభుత్వ వైద్య కళాశాలలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన ప్రొఫెసర్లు- 25, అసోసియేట్ ప్రొఫెసర్లు- 28, అసిస్టెంట్ ప్రొఫెసర్లు- 56 భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్, కళాశాల ప్రిన్సిపాల్ రవీంద్రకుమార్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోస్టుల భర్తీకి ఈనెల 25న మెదక్ ప్రభుత్వ వైద్య కళాశాలలో ఇంటర్వ్యూలు ఉంటాయని తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరిగే ఇంటర్వ్యూలకు అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు.

అర్హులకు సంక్షేమ పథకాలు అందాలి

- ప్రభుత్వ లక్ష్యాలు నెరవేర్చాలి
- అధికారులతో కలెక్టర్ రాహుల్‌రాజ్ సమీక్ష



ప్రజావాణిలో వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ కలెక్టరేట్: ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అర్హులైన ప్రజలకు అందాలని, ప్రభుత్వ లక్ష్యాలను నెరవేర్చేందుకు అధికారులు కృషి చేయాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆయాశాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ప్రభుత్వం చేపట్టిన పనులు, పురోగతి, ప్రజావాణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం, సంబంధిత శాఖల పనితీరు, క్షేత్రస్థాయి పర్యటనలు, డెంగీ, మలేరియా సోకకుండా ప్రజలను రక్షించడం, వన మహోత్సవం, మహిళా శక్తి తదితర అంశాలపై అధికారులతో మాట్లాడారు. ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రజలకు నూరు శాతం అందించినప్పుడే ఉత్తమ పాలన అందించిన వారమవుతామని వివరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డీఆర్డీఓ పీడీ శ్రీనివాసరావు, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి 136 వినతులు

కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన జిల్లాస్థాయి ప్రజావాణికి జిల్లా నలుమూలల నుంచి బాధితులు 136 వినతులు అందజేశారు. వినతులు స్వీకరించిన కలెక్టర్ రాహుల్‌రాజ్ ప్రాధాన్యతా క్రమంలో అర్జీలు పరిష్కరించి ప్రజలకు సమాధానం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి నేరుగా కలెక్టర్‌కు వచ్చి చెప్పుకోవాలన్నారు. ఇతరుల మీద ఆధారపడొద్దని సూచించారు. ధరణిపై 36, డబుల్‌బెడ్రూం ఇళ్లు 18, పెన్షన్ 8, రుణమాఫీ 7, ఇతర సమస్యలపై 67 వినతులు సమర్పించారు.

బోనాల ఉత్సవాలకు రండి

తూప్రాన్: డివిజన్ కేంద్రంలో ఈనెల 28వ తేదీన నిర్వహించే మహంకాళి బోనాల ఉత్సవాలకు హాజరుకావాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌ను సోమవారం కాంగ్రెస్ నాయకులు ఆహ్వానించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మామిళ్ల జ్యోతితో పాటు సిద్దిపేట డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ నందాల శ్రీనివాస్, నాయకులు గడప దేవేందర్, శ్రీశైలంగౌడ్, భగవాన్‌రెడ్డి, రవీందర్‌గుప్త, నాగరాజుగౌడ్, తదితరులు మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఆహ్వానపత్రిక అందజేస్తున్న నాయకులు

రికార్డులు పరిశీలించి.. నేరాలపై ఆరా తీసి



మాట్లాడుతున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

తూప్రాన్: డీఎస్పీ కార్యాలయాన్ని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి సోమవారం సందర్శించారు. ఈసందర్భంగా రికార్డులను పరిశీలించారు. అనంతరం డివిజన్ పరిధిలోని నేరాలు, దొంగతనాలు, రోడ్డు ప్రమాదాలు తదితర విషయాలపై డీఎస్పీ వెంకట్ రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. పోలీసు సిబ్బంది ప్రజలతో స్నేహ పూర్వకంగా ఉండాలని సూచించారు. నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం డివిజన్ పరిధిలోని ఎస్‌ఐ, సీఐలతో సమావేశం నిర్వహించారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

సీడీపీఓ హేమభార్గవి



అంగన్‌వాడీ టీచర్లతో సీడీపీఓ హేమభార్గవి

కౌడిపల్లి(నర్సాపూర్): అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని సీడీపీఓ హేమభార్గవి హెచ్చరించారు. సోమవారం మండలంలోని రాయిలాపూర్, భుజిరంపేట గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేసి టీచర్లతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు. కేంద్రాల్లో ఆట పాటలతో పూర్వ ప్రాథమిక విద్యాబోధన చేయాలన్నారు. పిల్లలో సృజనాత్మకతను వెలికి తీయాలని ఆదేశించారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు తప్పనిసరిగా సమయపాలన పాటించాలని ఆదేశించారు. కార్యక్రమంలో మండల సూపర్‌వైజర్లు శశికళ, లక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు విజయలక్ష్మి, సద్గుణ తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ చేసి ఆదుకోండి

కలెక్టరేట్ ఎదుట రైతుల ఆందోళన



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న రైతులు

మెదక్ కలెక్టరేట్: రుణమాఫీ చేసి ఆదుకోవాలని కోరుతూ మెదక్ మండలం ర్యాలమడుగు గ్రామ రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపిన కలెక్టర్ రాహుల్ రాజ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా రైతులు మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలోనూ మాకు రుణమాఫీ జరుగలేదని, ఇప్పుడు కూడా మాఫీ అవుతుందో లేదో తెలియక అయోమయానికి గురవుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. తమకు మెదక్‌లోని ఇండియన్ బ్యాంకులో ఖాతాలు ఉన్నాయని.. అయితే మా గ్రామంలోని కొంతమంది రైతులకు ఇతర బ్యాంకులో ఖాతాలు ఉండగా వారికి మాఫీ జరిగిందన్నారు. కానీ ఇండియన్ బ్యాంకులో ఉన్న మాకు మాత్రం మాఫీ కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈవిషయమై కలెక్టర్‌కు మొరపెట్టుకోగా రాష్ట్రవ్యాప్తంగా ఇండియన్ బ్యాంకులలో ఈ సమస్య నెలకొందని, త్వరలోనే అర్హులైన రైతులందరికీ రుణమాఫీ జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. వ్యవసాయ అధికారులకు పూర్తి సమాచారం అందజేయాలని సూచించినట్లు తెలిపారు. కార్యక్రమంలో రైతులు నర్సింలు, రాజు, బీరప్ప, సాయిబాబా, అనిల్‌రెడ్డి, రాజిరెడ్డి, మహేందర్‌రెడ్డి, సుజాత, ప్రమీల, లక్ష్మి, లచ్చిరెడ్డి, సంతోష్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రైస్‌మిల్లుల్లో ఆర్డీఓ తనిఖీ


ఎల్లారెడ్డిపేట శివారులోని రైస్ మిల్లును తనిఖీ చేసిన ఆర్డీఓ బన్సీలాల్

తొగుట(దుబ్బాక): ఎల్లారెడ్డిపేట శివారులో గల శ్రీశారదాంబ పారాబాయిల్డ్ రైస్ మిల్లును గజ్వేల్ ఆర్డీఓ బన్సీలాల్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైస్ మిల్లు రికార్డులను పరిశీలించారు. మిల్లులో గల ధాన్యం నిల్వలను పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో తొగుట, వర్గల్ తహసీల్దార్లు శ్రీకాంత్, బాలరాజు, ఆర్ఐ అశోక్ రాజ్, ఎస్ఐ రవికాంతారావు, సివిల్ సప్లయి డీటీ స్వామి పాల్గొన్నారు.

అటవీ అధికారుల చెంతకు నక్షత్ర తాబేలు


తాబేలును అధికారికి అప్పగించిన యువకుడు

సంగారెడ్డి టౌన్: తన కంట పడిన నక్షత్ర తాబేలును అటవీ శాఖాధికారులకు అప్పజెప్పాడు ఓ యువకుడు. విషయానికొస్తే.. పట్టణానికి చెందిన యువకుడు రాజు అరుదైన నక్షత్ర తాబేలు కంటపడింది. దీన్ని తీసుకొని జిల్లా అటవీ శాఖ అధికారి వీరేంద్రబాబుకు అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జంతు జాతులను కాపాడాలని ప్రజలను కోరారు. ఈయన వెంట ఫోరం ఫర్ బెటర్ జిల్లా అధ్యక్షుడు శ్రీధర్ మహేంద్ర, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బిజినెస్ ఇన్వెస్ట్‌మెంట్ పేరుతో టోకరా

రూ.13.83 లక్షలు పోగొట్టుకున్న ప్రైవేటు ఉద్యోగి



పటాన్‌చెరు టౌన్: బిజినెస్ ఇన్వెస్ట్‌మెంట్ పేరిట ఓ ప్రైవేటు ఉద్యోగి భారీగా డబ్బులు పోగొట్టుకున్నాడు. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు కథనం మేరకు... శ్రీనగర్ కాలనీకి చెందిన ఓ ప్రైవేటు ఉద్యోగికి జూన్ 5న వాట్సాప్ ద్వారా బిజినెస్ ఇన్వెస్ట్‌మెంట్ చేస్తే పెట్టిన నగదుతో పాటు కమీషన్ ఇస్తామని అపరిచిత వ్యక్తి నమ్మించాడు. దీంతో ప్రైవేటు ఉద్యోగి తన వివరాలను నమోదు చేసి, పలు దఫాలుగా రూ.13.83 లక్షలు ఇన్వెస్ట్ చేశాడు. ఒక రోజు బాధితులు తన పెట్టుబడితో పాటు కమీషన్ తిరిగివ్వాలని అడగటంతో అపరిచిత వ్యక్తి నుంచి స్పందన రాలేదు. దీంతో తాను మోసపోయినట్లు గుర్తించి ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు, పటాన్‌చెరు పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగంలో బదిలీలు సహజం

మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల


ఉద్యోగుల వీడ్కోలు సమావేశంలో చైర్‌పర్సన్ మంజుల, కమిషనర్ ప్రసన్నరాణి

సిద్దిపేటజోన్: ప్రతి ఉద్యోగి జీవితంలో బదిలీలు సహజమని మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల అన్నారు. సోమవారం సిద్దిపేట మున్సిపల్‌లో గత కొంతకాలంగా పని చేసిన వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది సాధారణ బదిలీల్లో భాగంగా ఇతర మున్సిపాలిటీలకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా వారిని మున్సిపల్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అనంతరం వీడ్కోలు సమావేశంలో చైర్‌పర్సన్ మంజుల, కమిషనర్ ప్రసన్న రాణి మాట్లాడుతూ సిద్దిపేట ప్రగతిలో వారి పాత్ర చాలా ఉందని కొనియాడారు. ఇదే తరహాలో అక్కడ కూడా పనిచేయాలన్నారు. పని చేసే చోట అక్కడి ప్రజలు, నాయకుల అభిమానాన్ని పొందాలన్నారు. భవిష్యత్‌లో మరింత ఉన్నతమైన స్థాయిలో ఉండాలని ఆకాంక్షించారు.

బల్దియాలో బదిలీలు

హరితహారం అధికారి ఐలయ్య కామారెడ్డి మున్సిపాలిటీకి, రెవెన్యూ విభాగం ఉద్యోగి కిష్టయ్య కరీంనగర్‌కు, కనకయ్య మెదక్‌కు, ప్రసాద్ హుస్నాబాద్‌కు, రమేశ్ గజ్వేల్‌కు మొగిలి హుస్నాబాద్‌కు, సుమలత గజ్వేల్‌కు, మేఘమాల దుబ్బాక మున్సిపాలిటీకి బదిలీ అయ్యారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ కనకరాజు, కౌన్సిలర్లు మల్లికార్జున్, రాజు, నాగరాజురెడ్డి, కో–ఆప్షన్ సభ్యులు షాహిద్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

కొనేదెలా.. తినేదెలా!

- మండుతున్న కూరగాయల ధరలు
- దిగుబడి లేక పెరిగిన రేట్లు



కూరగాయల ధరల మండుతున్నాయి. సామాన్యుడు, మధ్య తరగతి ప్రజల బడ్జెట్‌కు ఇది మించిపోతోంది. ఏది ముట్టుకున్నా రూ.80–100లు పలుకుతోంది. ఇక ఏం తింటాం.. ఏం కొంటామని జనం అసహనం వ్యక్తం చేస్తున్నారు. కేజీ కొనేవారు పావు కిలోతో సర్దుకుంటున్నారు. ఇతర రాష్ట్రాల్లో వర్షాల వల్ల అక్కడ దిగుబడి తగ్గింది.. సరుకు దిగుమతి కూడా తక్కువగా వచ్చిందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.

జహీరాబాద్ టౌన్: ఉల్లి ఘాటెక్కింది.. వెల్లుల్లి వంటింటి లోపలికి రానని లొల్లి చేస్తుంది. టమాటా వండకుండానే కుతకుత మంటుంది. ఏ కూరగాయాలు కొనాలన్నా రూ.100 తక్కువ పలకడం లేదు. కిలో కొనే వారు పావు కిలోతోనే సరిపెట్టుకుంటున్నారు. రూ. 500తో మార్కెట్‌కు వెళ్లితే సంచి నిండడంలేదు. నిరుపేదలు కూరగాయలు కొనలేక పప్పుచారుతోనే సరిపెట్టుకుంటున్నారు.

జహీరాబాద్ నియోజకవర్గంలో ప్రతి సంవత్సరం సుమారు 20 వేల ఎకరాల్లో రైతులు కూరగాయలు సాగు చేస్తున్నారు. కర్ణాటక, మహారాష్ట్ర నుంచి మార్కెట్‌కు రోజూ కూరగాయలు వస్తుంటాయి. వర్షాల ప్రభావం వల్ల దిగుబడి లేక ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి తగ్గడంతో ధరలు ఆకాశాన్ని అంటాయి. ఏదీ కొనలన్నా కిలో రూ. 100 తక్కువ పలకడంలేదు. జహీరాబాద్ ప్రాంతంలోని రైతులు టమాటా, బెండకాయ, చిక్కుడు, గోరు చిక్కుడుతో పాటు ఆకు కూరలు సాగు చేస్తుంటారు. కర్నాటక, మహారాష్ట్ర నుంచి క్యాబేజీ, కాలీఫ్లవర్, ఉల్లిగడ్డ, వెల్లుల్లి, క్యారెట్, బీట్‌రూట్, బీరకాయ, టమాటా పట్టణ మార్కెట్‌కు వస్తుంటాయి. వానాకాలం ప్రారంభలో వర్షాలు లేవు. ప్రస్తుతం విపరీతమైన వానలు కురుస్తుండటం వల్ల పంట దిగుబడి పడిపోయింది. రైతులు నష్టపోగా ప్రజలపై అధిక భారమవుతోంది. అల్లం, వెల్లుల్లి రేట్లు కూడా పెరిగాయి. టమాటా ధరలు దిగిరావడం లేదు. ప్రస్తుతం మార్కెట్‌లో టమాటా కిలో రూ. 80 పలుకుతుంది. పచ్చి మిర్చి కిలో రూ. 120 వరకు పలుకుతుంది. ఆకు కూరలు తప్ప మిగతా కూరగాయలు కిలో రూ.100 తక్కువ పలకడం లేదు. వెల్లుల్లి కిలో రూ. 240, అల్లం రూ. 150 పలుకుతోంది. మొన్నటి వరకు అందుబాటు ధరలో ఉన్న ఉల్లి ప్రస్తుతం పెరిగింది. బిన్నీస్, బీరకాయ, క్యాప్సికం, చిక్కుడు తదితర కూరగాయలు కిలో రూ.80 తక్కువ పలకడంలేదు.


జహీరాబాద్ సంతలో విక్రయిస్తున్న కూరగాయలు

దిగుబడి తగ్గింది

డిమాండ్‌కు తగ్గ కూరగాయల దిగుబడి లేదు. వేసవి ఎండలు ఆ తరువాత వర్షాలకు దిగుబడి బాగా తగ్గింది. ఎండలు, వానలకు టమాటా పంట దెబ్బతింది. మిగతా కూరగాయల పరిస్థితి కూడా ఇలాగే ఉంది. అందుకని ధరలు తగ్గడంలేదు. దిగుబడి తగ్గిన ప్రతిసారి రేటు పెరిగి డిమాండ్ ఉంటుంది. ముందు చూపుతో ప్రణాళిక ప్రకారం కూరగాయల సాగు చేసినట్లయితే అధిక లాభాలు వచ్చే అవకాశం ఉంది.

–శ్రీనివాస్ రైతు, జహీరాబాద్

కొనలేకపోతున్నాం

కూరగాయల ధరలు మండుతున్నాయి. ధర ప్రభావం వల్ల సరిపడా కూరగాయలను కొనలేకపోతున్నాం. ఏది కొనలన్నా కిలో రూ. 80 తక్కువ పలకడం లేదు. వారంతపు సంతలో కూడా ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. ధరల ప్రభావం వల్ల పావు కిలోతోనే సరిపెట్టుకుంటున్నాం.

–రాఘవేంద్రర్, జహీరాబాద్

పాస్‌బుక్‌లు ఇవ్వాలని ధర్నా

మెదక్ కలెక్టరేట్: పట్టాదారు పాస్‌బుక్కులు ఇవ్వాలని సోమవారం భూ పోరాట కమిటీ ఆధ్వర్యంలో చేగుంట మండలం చిట్టోజిపల్లి రైతులు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు, మాజీ అధ్యక్షుడు ఏ.మల్లేశం, కే.మల్లేశంలు మాట్లాడుతూ చిట్టోజిపల్లి రైతులు ఏళ్లుగా గ్రామ శివారులో గల సర్వేనంబర్ 266/1లో ఉన్న భూమిని సాగు చేసుకుంటున్నారు. 1955 సంవత్సరం కాస్రా పహాణీ ప్రకారం ప్రభుత్వ భూమిగా రికార్డ్‌లో ఉందన్నారు. సీలింగ్ చట్టం ప్రకారం 1974 సంవత్సరంలో 278 ఎకరాల భూమిని పేదలకు పంచినట్లు తెలిపారు. అనంతరం 1993లో భూదాన యజ్ఞ బోర్డు ద్వారా 80 ఎకరాల్లో పేదలకు పట్టాలు పంపిణీ చేసినట్లు వెల్లడించారు. అనంతరం 2004లో మళ్లీ భూదాన్ బోర్డు ద్వారా 320 ఎకరాలు పేదలకు పంపిణీ చేశారని గుర్తుచేశారు. ఇలా పలుమార్లు పేదలకు పంపిణీ చేసిన భూమిని కొంతమంది పెద్దలు ఇబ్రహీంపూర్ గ్రామ శివారులోని ఓ ఆలయానికి రిజిస్ట్రేషన్ చేయాలని ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. దాన్ని వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం భూ ప్రక్షాళన పేరుతో కొంతమందికి పట్టా పాస్‌బుక్‌లు ఇచ్చి కొంతమందికి ఇవ్వకుండా ఆపిందని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రతి రైతుకు పట్టా పాస్ బుక్‌లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భూ పోరాట కమిటీ నాయకులు ఏం లక్ష్మీనరసయ్య, ఎం శ్రీనివాస్, కే మల్లేశం, పరశురాం, ప్రశాంత్, రాజు, మున్నయ్య, యాదగిరి, లక్ష్మి, మహేశ్, శీను తదితరులు పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న చిట్టోజిపల్లి రైతులు

జల్సా జీవితం గడిపేందుకు..

ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ.. దొంగగా మారిన వ్యక్తి అరెస్టు

సిద్దిపేటకమాన్: ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తూ తాళం వేసి ఉన్న ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన పట్టణంలో చోటు చేసుకుంది. టూటౌన్ సీఐ ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నకోడూరు మండలం చౌడారానికి చెందిన వల్లెపు భాస్కర్ ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. జల్సా జీవితం గడపడానికి ఐదేళ్లుగా సిద్దిపేట టూటౌన్, చిన్నకోడూరు పోలీసు స్టేషన్ పరిధిలో పలు దొంగతనాలకు పాల్పడ్డాడు. సోమవారం పట్టణంలోని నెహ్రూ పార్క్ ప్రాంతంలో దొంగతనం చేసేందుకు తిరుగుతుండగా పోలీసులు అనుమానంతో అదుపులోకి తీసుకొని విచారించారు. దీంతో 2023 నవంబర్‌లో గుండ్ల చెరువు ప్రాంతంలోని ఓ ఇంట్లో రూ.60 వేలు, 2024 మార్చిలో పాత బస్టాండ్ పక్కనున్న పెట్రోల్ బంక్‌లో రూ.5,300లు, ఈ నెలలో శ్రీనివాసనగర్‌లోని ఆటో స్పేర్స్ మొబైల్ షాప్‌లో రూ. 65 వేలు దొంగిలించినట్లు నిందితుడు ఒప్పుకున్నాడని పోలీసులు తెలిపారు. అతడి నుంచి రూ.10 వేలు రికవరీ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. ఇదిలా ఉండగా 2022లో తన సొంతూరైన చౌడారంలో 4 ఇళ్లలో దొంగతనాలకు పాల్పడి జైలు శిక్ష అనుభవించినట్లు గుర్తించారు.

నాణ్యత లేకుంటే చర్యలు తప్పవు

బిర్యానీ పాయింట్లలో ఫుడ్ఇన్‌స్పెక్టర్ తనిఖీ

తూప్రాన్: బిర్యానీ సెంటర్ల నిర్వాహకులు నాణ్యతా ప్రమాణాలు పాటించకపోతే చర్యలు తప్పవని జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తౌర్య నాయక్ హెచ్చరించారు. డివిజన్ కేంద్రంలోని ఒక బిర్యానీ పాయింట్‌లో తిని సుమారు 20 మందికిపైగా అస్వస్థతకు గురైన నేపథ్యంలో సోమవారం మున్సిపల్ కమిషనర్ ఖాజా మోహిజొద్దీన్‌తో కలిసి ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హోటల్ మండి, శుభం మెస్, గోల్డన్ హోటల్‌తో పాటు పలు బిర్యానీ పాయింట్లను తనిఖీలు చేశారు. అందులో భోజనం, చికెన్, కూరగాయలు, కిచెన్ షెడ్లను పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా నాసిరకంగా వంటకాలు చేస్తే చట్టరీత్య చర్యలు తీసుకుంటామన్నారు.

వ్యక్తి అదృశ్యం


సుధాకర్

తూప్రాన్: దైవ దర్శనానికి వెళ్లిన భార్త తిరిగి ఇంటికి చేరుకోలేదని పోలీసులకు ఓ భార్య ఫిర్యాదు చేసింది. సోమవారం ఎస్ఐ శివానందం తెలిపిన వివరాల ప్రకారం... డివిజన్ కేంద్రానికి చెందిన ఎం.సుధాకర్ (40) గత నెల 28న తిరుపతికి వెళ్లారు. అక్కడి నుంచి విజయవాడకు సైతం వెళ్తానని చెప్పి వెళ్లిన వ్యక్తి తిరిగి ఇంటికి చేరుకోలేదు. దీంతో భార్య శోభ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.

అల్లం ధరపై ఆందోళన

కేరళ లేత అల్లంతో నాణ్యమైన పంటకు దక్కని రేటు

- కమీషన్ ఏజెంట్లు ఆరాష్ట్ర రైతులతో కుమ్మక్కు!
- 2 నెలల పాటు దిగుమతులు ఆపాలని సీఎం, మంత్రికి వినతి
- ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన

కేరళ రాష్ట్రం నుంచి వచ్చే లేత అల్లం(పక్వానికి రాని) మూలంగా ఉమ్మడి జిల్లా నుంచి తరలించే పంటకు మార్కెట్‌లో డిమాండ్ పడిపోతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మార్కెట్‌కు తరలిస్తే సగానికి సగం ధర పడిపోతుందని పేర్కొంటున్నారు. హైదరాబాద్ మార్కెట్‌కు అత్యధికంగా కేరళ నుంచి అల్లం దిగుమతవుతోంది. జహీరాబాద్, ములుగు, సిద్దిపేట ప్రాంతాల నుంచి తరలించుకునే నాణ్యమైన పంటను వ్యాపారులు విక్రయించకుండా పక్కన పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. –జహీరాబాద్

ప్రస్తుతం మార్కెట్లో క్వింటాలు అల్లం ధర రూ. 8వేల నుంచి 10 వేల వరకు పలుకుతోంది. 'కేరళ లేత అల్లం పంట మార్కెట్లో కేవలం క్వింటాలు రూ.4 వేలకు విక్రయిస్తున్నారు. ఇలా విక్రయిస్తే చిరు వ్యాపారులతో పాటు పెద్ద పెద్ద రెస్టారెంట్లు సైతం లేత అల్లాన్నే ఉపయోగిస్తున్నాయి. కమీషన్ ఏజెంట్లు కేరళ రైతులతో కుమ్మక్కై తమ ప్రాంత ఉత్పత్తులకు ధర తగ్గించేలా ప్రయత్నం చేస్తున్నారని' రైతులు ఆరోపిస్తున్నారు. 'ఒక ఎకరానికి రూ.3 లక్షల వరకు పంట సాగు కోసం ఖర్చు పెడుతున్నాం. మార్కెట్లో ధరలు పాడేయడం వల్ల ఇబ్బందులు పడాల్సి వస్తోంది. కేవలం ఒక్క జహీరాబాద్ ప్రాంతంలోనే సుమారు 3 వేల ఎకరాల్లో అల్లం సాగవుతోందని' చెబుతున్నారు.


మంత్రి రాజనర్సింహకు వినతిపత్రం ఇస్తున్న జహీరాబాద్ ప్రాంత అల్లం రైతులు (ఫైల్)

సీఎం, మంత్రి దృష్టికి సమస్యలు

కేరళ లేత అల్లం పంట వల్ల ఎదురవుతున్న సమస్యలపై సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ ఎన్.గిరిధర్‌రెడ్డి, జహీరాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఎస్.ఉజ్వల్‌రెడ్డిల ఆధ్వర్యంలో ఈనెల 15న రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను విన్నవించారు. మంత్రితో పాటు రైతుల ప్రతినిధిగా ఉజ్వల్‌రెడ్డి అదే రోజు సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వినతి సమర్పించారు. పరిష్కారానికి హామీ ఇచ్చి ఆ మేరకు అధికార యంత్రానికి ఆదేశాలు జారీ చేశారు. 2 నెలలు మాత్రమే కేరళ నుంచి తీసుకు వచ్చే లేత అల్లం తరలింపును నిలిపేయాలని కోరారు. జూలై, ఆగస్టు నెలల్లో తమ ఉత్పత్తుల అమ్మకం పూర్తవుతుందని, అప్పటి వరకు దిగుమతులు నిలిపివేయాలని విజ్ఞప్తి చేశారు. అల్లం దిగుమతుల విషయంలో తమకు ఎలాంటి అభ్యంతరం లేదని విన్నవించారు. ఈ అభ్యర్థనతో ప్రభుత్వం వ్యవసాయ, ఉద్యానవన శాఖలకు మౌఖిక ఆదేశాలు ఇచ్చింది. దీంతో ఉస్మాన్‌గంజ్‌లోని కమీషన్ ఏజెంట్లతో అధికారులు సమావేశం నిర్వహించి లేత అల్లం ఉత్పత్తులను దిగుమతి చేసుకోకుండా చూడాలని సూచించింది. ఇందుకు వారు కూడా సానుకూలంగా స్పందించడంతో రైతులు సంతోషం వ్యక్తంచేశారు. ప్రభుత్వ ఆదేశాలు మరో రెండు రోజుల్లో అమల్లోకే వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. ఆ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి దామోదర రాజనర్సింహలకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వం సానుకూలం

కేరళ నుంచి వస్తున్న నాసిరకం అల్లం మూలంగా మార్కెట్లో ఎదురవుతున్న సమస్యల గురించి రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం జహీరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో రైతులు రవీందర్‌రెడ్డి, ఎ.శ్రీనివాస్‌రెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, రమేశ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, పాపిరెడ్డి, ఎన్.జగన్నాథ్‌రెడ్డి, సంజీవరెడ్డి, జె.నర్సింహారెడ్డి, శాంత్‌కుమార్ తదితరులు సమావేశమయ్యారు. కేరళ నుంచి వస్తున్న మోడ్(లేత) అల్లం వల్ల జరుగుతున్న నష్టాన్ని వివరించారు. తాము ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన వెంటనే సానుకూలంగా స్పందించడం సంతోషంగా ఉందన్నారు.

మా అల్లంను పక్కన పెడుతున్నారు



మేము పండించిన అల్లం పంటను మార్కెట్‌కు తీసుకెళ్తే అమ్మకానికి పెట్టకుండా పక్కన పెడుతున్నారు. కేరళ నుంచి వస్తున్న లేత అల్లానికే కమీషన్ ఏజెంట్లు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. దీంతో ధర రాక నష్టపోతున్నాం. ఈ విషయాన్ని మంత్రి, సీఎం దృష్టికి తీసుకెళ్లడంతో సమస్య పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది.

– రవీందర్‌రెడ్డి, రైతు జహీరాబాద్

ఫీజ్ వైర్ వేస్తుండగా..

షాక్ తగిలి జూనియర్ లైన్ మెన్ మృతి


గణేశ్ (ఫైల్)

అల్లాదుర్గం(మెదక్): విద్యుత్ స్తంభం ఎక్కి ఫీజ్ వైర్ వేస్తుండగా షాక్ తగిలి జూనియర్ లైన్‌మెన్ మృతిచెందాడు. ఈ సంఘటన అల్లాదుర్గంలో సోమవారం ఉదయం చోటు చేసుకుంది. స్థానికులు, ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపిన వివరాలు.. రెడ్డిపల్లి గ్రామ జూనియర్ లైన్‌మెన్‌గా గణేశ్(24) తొమ్మిది నెలల క్రితం విధుల్లో చేరాడు. రాంపూర్ ఫీడర్ వద్ద ఫీజ్ కట్ కావడంతో దాన్ని వేసేందుకు ఉదయం లైన్‌మెన్ రామకృష్ణతో కలిసి అతను అక్కడికి వెళ్లాడు. విద్యుత్ స్తంభం ఎక్కేందుకు ఎల్‌సీ తీసుకోవాలని లైన్‌మెన్‌తో చెప్పారు. రామకృష్ణ చేతి గ్లౌజ్‌లు తెస్తానని చెప్పి సబ్ స్టేషన్‌కు వెళ్లారు. అప్పటికే గణేశ్ స్తంభం ఎక్కి పని చేస్తున్న క్రమంలో షాక్‌కు గురై పై నుంచి కిందపడ్డారు. అక్కడికి చెరుకున్న లైన్‌మెన్ రామకృష్ణ గమనించి వెంటనే 108లో బాధితుడిని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందారు. ఎల్‌సీ తీసుకోకపోవడంతో ఈ ప్రమాదం జరిగిందని విద్యుత్ అధికారులు పేర్కొన్నారు. మృతుడి తండ్రి సాయిలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రవీణ్ రెడ్డి తెలిపారు.

మృతుడు కన్‌సాన్‌పల్లివాసిగా గుర్తింపు

గుర్తుతెలియని కారు.. వ్యక్తిని ఢీకొన్న ఘటనలో పురోగతి


అబ్దుల్లా (ఫైల్)

వట్‌పల్లి(అందోల్): అందోల్ మండలం రాంసాన్‌పల్లి గ్రామ శివారులో ఆదివారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతిచెందగా, అతను కన్‌సాన్‌పల్లి వాసి దూదేకులా అబ్దుల్లా (62)గా సోమవారం పోలీసులు గుర్తించారు. ఎస్ఐ పాండు తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యాహ్నం పొలానికి వెళ్లి కట్టెలు తీసుకు వస్తానని ఇంటి నుంచి అబ్దుల్లా బయలుదేరాడు. అదేరోజు రాత్రి 9 గంటల ప్రాంతంలో కన్‌సాన్‌పల్లి వైపు నడుచుకుంటూ జియో పెట్రోల్ బంక్ సమీపానికి రాగా సంగారెడ్డి నుంచి నారాయణఖేడ్ వైపు వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో అబ్దుల్లా రోడ్డు మీద పడిపోయాడు. ఆ తర్వాత కూడా అతడి మీద నుంచి రెండు, మూడు వాహనాలు కూడా వెళ్లడంతో మృతదేహం నుజ్జునుజ్జయ్యినట్లు అనుమానిస్తున్నారు. అప్పటికే ఆ ప్రాంతమంతా చీకటి అలుముకొని ఉంది. కాగా, ఉదయం వెళ్లిన వ్యక్తి రాత్రి వరకు తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గ్రామంలోని అన్ని ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. సోమవారం ఉదయం రాంసానిపల్లి వద్ద యాక్సిడెంట్‌లో ఎవరో చనిపోయినట్లు తెలుసుకుని జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి కుటుంబీకులు మృతదేహాన్ని చూసి అబ్దుల్లాదిగా గుర్తించి రోదించారు. మృతుడి కుమారుడు షాదుల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని జోగిపేట పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మొదట ఢీకొట్టిన వాహనాన్ని గుర్తించేందుకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

తాగేందుకు డబ్బులు ఇవ్వలేదని..

యువకుడి ఆత్మహత్య

హవేళిఘణాపూర్(మెదక్): మద్యానికి బానిసైన ఓ యువకుడు తాగేందుకు డబ్బులు ఇవ్వలేదని మనస్తాపానికి గురై ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రమైన హవేళిఘణాపూర్‌కు చెందిన మంగ బతుకుదెరువు నిమిత్తం హైదరాబాద్‌లో నివసిస్తుండగా కుమారుడు మూగ నాగరాజు(19) సొంతూరులోనే ఉంటున్నాడు. దీంతో మద్యానికి బానిసయ్యాడు. సోమవారం ఉదయం నానమ్మను మందు తాగేందుకు డబ్బులు అడుగగా ఇవ్వలేదు. దీంతో మనస్తాపానికి గురయ్యాడు. ఆమె పొలం పనికి వెళ్లిన తర్వాత ఇంట్లో దూలానికి చీరతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయాన్ని గమనించిన పొరుగింటి వారు కిందకు దించి చూస్తే అప్పటికే మృతిచెందాడు. సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసినట్లు హవేళిఘణాపూర్ పోలీసులు తెలిపారు.

ముగ్గురికి డెంగీ?

చేగుంట మండలంలో కలకలం



చేగుంట(తూప్రాన్): ముగ్గురిలో డెంగీ లక్షణాలు కనిపించాయని తెలిసింది. మండలంలోని జెత్రం తండాకు చెందిన ధన్నూ డీసీఎం డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అతని కూతురు సరిత ఇటీవల ప్రసవించింది. ఆ తర్వాత జ్వరంతో బాధపడుతుంటే లక్ష్మక్కపల్లిలోని ఆర్వీఎం ఆస్పత్రికి తరలించారు. ఆమెకు, పుట్టిన చిన్నారికి సైతం డెంగీ లక్షణాలు ఉన్నాయనే అనుమానంతో హైదరాబాద్ నిలోఫర్ ఆస్పత్రికి తరలించారని సమాచారం. ఇదే తండాకు చెందిన రాందాసుకు సైతం ఇదే లక్షణాలు కనిపించడంతో నార్సింగిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిసింది.

ఆలయ భూములు అన్యాక్రాంతం కాకూడదు

బీజేపీ రాష్ట్ర యువ మోర్చా ప్రధానకార్యదర్శి సురేశ్


మాట్లాడుతున్న సురేశ్

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలని బీజేపీ రాష్ట్ర యువమోర్చా ప్రధానకార్యదర్శి బొంగోని సురేశ్ అన్నారు. సోమవారం మండలంలోని కిష్టంపేటలో ఉన్న ఫంక్షన్ హాల్లో పార్టీ మండల అధ్యక్షుడు నాగరాజు అధ్యక్షత వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి హాజరై ఆయన మాట్లాడారు. మల్లికార్జున స్వామి ఆలయ భూముల పరిరక్షణకు ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలని పిలుపునిచ్చారు. అధికార పార్టీ నాయకులు అన్యాక్రాంతం చేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. మల్లన్న ఆలయంలో ధర్మకర్తల మండలి చైర్మన్ పదవిని స్వామికి సేవచేసే భక్తులకు ఇవ్వాలన్నారు. దాసారం గుట్టను ఆలయ అధికారులు కొంటే భవిష్యత్‌లో పార్కింగ్, వసతిగృహాలకు ఉపయోగపడుతుందన్నారు. రాష్ట్రంలో అమలు కాని హామీలిచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. రైతుకు రెండు విడుతలుగా రైతు భరోసా ఇవ్వకుండా అదే డబ్బులతో రైతు రుణమాఫీ చేశారని ఆరోపించారు. కాంగ్రెస్‌ను ప్రజలు ఛీ కొట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలని కార్యకర్తలకు సూచించారు. వర్షాకాలం మొదలై రెండు నెలలైనా సరైన వానలు కురవక రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి తపాస్‌పల్లి రిజర్వాయర్ ద్వారా మండలంలోని చెరువులు కుంటలను నింపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో లక్ష్మారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ఉమారాణి, మహిళ మోర్చా అధ్యక్షులు ఉమా, సనాది కరుణాకర్ రెడ్డి పాల్గొన్నారు.

చెట్టును ఢీకొన్న లారీ

కొమ్మ మీద పడి విద్యార్థినికి గాయాలు

తోటపల్లి బస్ స్టేజీ వద్ద ఘటన

హుస్నాబాద్‌రూరల్: చెట్టును కంటైనర్ లారీ ఢీకొన్న ఘటనలో కొమ్మ విరిగి పడి విద్యార్థినికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. తోటపల్లి బస్ స్టేజీ వద్ద సోమవారం లారీ చెట్టును ఢీకొనడంతో కొమ్మ విరిగిపడింది. అదే సమయంలో కళాశాలకు వెళ్లేందుకు బస్ స్టేజీ వద్దకు వచ్చిన విద్యార్థిని అశ్వినిపై పడింది. దీంతో ఆమెకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు.. విద్యార్థినిని హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందించారు. ప్రమాదం గురించి పోలీసులకు సమాచారం ఇవ్వగా ఇక్కడికి చేరుకొని కంటైనర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.


కంటైనర్‌పై పడిన కొమ్మ